క్లుప్తంగా

కూర్మావతారంలో జనార్దన స్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్దన స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి కూర్మావతార అలంకరణ చేశారు. రాత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ విశేష పూజలు నిర్వహించగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

27న విద్యుత్ ఓసీ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యుత్ ఓసీ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ, 15వ వార్షికోత్సవం ఈనెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు సంఘ ఈపీడీసీఎల్ డిస్కమ్ ప్రధాన కార్యదర్శి తురగా రామకృష్ణ తెలిపారు. నగరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం భీమవరంలోని కె కన్వెన్షన్ కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. వీరితో పాటు జిల్లాలోని శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు, కమ్యూనిటీ అధ్యక్షులను ఆహ్వానించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి కార్యక్రమంలో పాల్గొనడానికి ఉద్యోగులు తరలి రానున్నారని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.గోపాలకృష్ణ, ఎం.నిరంజన్, డివిజన్ సెక్రటరీ సీహెచ్‌పీ శ్రీనివాస్, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై దాడి

10 ట్రాక్టర్లు సీజ్

ఏలూరు రూరల్: అనుమతి లేకుండా మట్టి అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా కలెక్టర్ వె ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి ఏలూరు శివారు ప్రాంతాలైన చొదిమెళ్ళ, దుగ్గిరాల వద్ద మట్టి అక్రమ తవ్వకాలపై అధికారులు దాడులు చేసారు. ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖజావలి, హౌసింగ్ పీడీ కె రవి కుమార్‌తో పాటు ఏలూరు నగర కార్పొరేషన్ కమిషనర్ ఎస్ వెంకటకృష్ణ పోలీసులతో కలిసి వెళ్లి అక్రమార్కులను అడ్డుకున్నారు. మట్టి తరలిస్తున్న 10 ట్రాక్టర్లను సీజ్ చేసి, కేసు నమోదు చేసారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మాత్రమే తమ్మిలేరు పరిసరాల్లో తవ్వకాలకు అనుమతి ఇచ్చామని కలెక్టర్ వెల్లడించారు. లబ్ధిదారుల ముసుగులో రాత్రి వేళ అక్రమ తవ్వకాలు చేపట్టే వారిపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు.



పురాతన సీఎస్ఐ చర్చి



సీఎస్ఐ చర్చిలో పశువుల పాక సెట్టింగ్

క్రిస్మస్ సందడి

ఏలూరు నగరంలో క్రిస్మస్ సందడి మొదలైంది. ప్రధాన చర్చిలు విద్యుత్ కాంతుల్లో వెలిగిపోతున్నాయి. చర్చిల్లో క్రీస్తు జననాన్ని తెలుపుతూ పశువుల పాకలు ఏర్పాటు చేసి సుందరంగా ముస్తాబు చేశారు. క్రిస్మస్ ప్రార్థనలు ఆదివారం అర్ధరాత్రి నుంచి మొదలయ్యాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



ఐఎస్ఎం చర్చి



లూథరన్ చర్చి

అమలోద్భవి విచారణలో క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విచారణ గురువు ఇంజే పాల్, యువత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్‌లోని అమలోద్భవి విచారణలో క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విచారణ గురువు ఫాదర్ ఇంజే పాల్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జననం ప్రపంచానికి విలువైనది, ఉన్నతమైనదన్నారు. ప్రపంచ శాంతి కోసం ఇరుగు పొరుగు సౌలభ్యం కోసం దైవానుభూతి పొంది సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తమ శ్రేయోభిలాషులతో శుభాకాంక్షలు పంచుకోవడం చెప్పుకోదగిన విశేషమన్నారు. పూజ ప్రార్థనలో అనేక మంది విశ్వాసులు, స్థానికులు పాల్గొని దైవకృప పొందారన్నారు. ఈ సందర్భంగా తమ విచారణకు చెందిన యువత వినూత్న పద్ధతిలో తమ పరిధిలోని అనేక కుటుంబాలను సందర్శించి కారెల్స్ పాటలు పాడి క్రీస్తు జననంలో ఇమిడి ఉన్న శాంతి సందేశాన్ని వారికి తెలిపారు.

పేదలకు పక్కా ఇళ్లు



జాలిపూడిలో ఇళ్లు కట్టుకుంటున్న దృశ్యం



లబ్ధిదారుడు కట్టుకున్న ఇల్లు



పైడిచింతపాడు జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్న నివాసితులు (ఫైల్)

- 1,088 ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- రూ.12.77 కోట్లు అందజేత

ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కల సాకారం అవుతోంది. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు ఎందరో సొంతిల్లు కట్టుకుని సంతోషంగా జీవిస్తున్నారు. దీనికి కారణం పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి నిలపడమే. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హౌసింగ్ శాఖకు కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తున్నారు. 2023 నవంబర్ నెలాఖరు నాటికి ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో 1,088 మంది సొంతిళ్లు కట్టుకున్నారు. వీరికి ప్రభుత్వం రూ.12 కోట్ల 77 లక్షలు 81 వేలు అందజేసింది.

గ్రామాల వారీగా నిధులు

చాటపర్రు రూ.2,96,35,873, పైడిచింతపాడు రూ.81,96,482, ప్రత్తికోళ్లలంక రూ.1,25,93,456, కేడీపురం రూ.3,28,1459, కోమటిలంక రూ.26,12,393, శ్రీపర్రు రూ.1,09,08278, పెదయాగనమిల్లి రూ.1,50,0000, గుడివాకలంక రూ.6,54,6651, జాలిపూడి రూ.2,02,21,461, మల్కాపురం రూ.1,91,57,344, మాదేపల్లి రూ.1,31,28,091లు ప్రభుత్వం అందజేసింది.

నాలుగు దశల్లో నగదు మంజూరు

ఇంటి నిర్మాణం చేపట్టిన పేదలకు అధికారులు క్రమం తప్పకుండా నిధులు మంజూరు చేస్తున్నారు. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా కాలనీల వద్దే ఇసుక, సిమెంట్, ఐరన్ అందుబాటులో ఉంచుతున్నారు. పనులు ప్రారంభం కాగానే బేస్‌మెంట్ లెవెల్‌లో రూ.70, 000, రూఫ్ లెవెల్‌లో రూ.37, 600. రూఫ్ కాస్ట్ రూ.21,200, కంప్లీట్ దశలో రూ.21,200లు లబ్ధిదారులు ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీనికి తోడు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల వేతనం రూ.30,000లు అందిస్తున్నారు. అలాగే మరో రూ.30 వేలు లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల నుంచి అప్పుగా ఇప్పిస్తున్నారు.

అధికారులు ప్రత్యేక శ్రద్ధ

ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ అధికారులతో పాటు మండల పరిషత్, ఇంజినీరింగ్ శాఖాధికారులు, సచివాలయ సిబ్బంది సైతం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. లబ్ధిదారులను వ్యక్తిగతంగా కలుసుకుని వారికి అవసరమైన రోడ్లు, నీటి మౌలిక వసతులు కల్పిస్తున్నారు.

చురుగ్గా నిర్మాణ పనులు



మా గ్రామంలో ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. లబ్ధిదారులు ఉత్సాహంగా ఇళ్లు కట్టుకుంటున్నారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం నిధులు వారి ఖాతాల్లో జమ చేస్తోంది. కొత్త వారికి సైతం అధికారులు పట్టాలు మంజూరు చేశారు. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. గతంలో ఎన్నడూ మా ఊరిలో ఇంత పెద్ద ఎత్తున ఇళ్లు కట్టుకున్నది లేదు.

– ముంగర తిమోతి, పైడిచింతపాడు సర్పంచ్

మౌలిక వసతులు కల్పించాం



కొల్లేరు గ్రామాల్లో పేదలు ఇళ్లు కట్టుకోవాలంటే ఎంతో వ్యయం అవుతుంది. భూమి బురదమయం కావడం వల్ల ముందుగా మెరక చేసుకోవాలి. దీన్ని గుర్తించి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వం నుంచి కోట్ల రూపాయలు మంజూరు చేయించి జగనన్న కాలనీలు మెరక చేయించారు. దీనివల్ల లబ్ధిదారులకు భవిష్యత్తులో ఎలాంటి ముంపు సమస్య ఉండదు. కాలనీల్లో రోడ్లు, బోర్లు వేసి, వాటర్ సప్లై అందుబాటులోకి తెచ్చాం.

– పెన్మెత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

సామాజిక సేవకు ఆర్యవైశ్యులు ప్రాధాన్యం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏలూరు జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సామాజిక సేవకు ఆర్యవైశ్యులు అత్యధిక ప్రాధాన్యం ఇస్తారని, ఈ విషయంలో ఆర్యవైశ్యులకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని మాజీ ఎమ్మెల్యే, పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ తెలిపారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఏలూరు జిల్లా కమిటీ ఎన్నిక ఆదివారం ఏలూరులోని సీతారాం భర్తియా కళ్యాణ మండపంలో పండుగ వాతావరణంలో జరిగింది. మహాసభలో ఏలూరు జిల్లా అధ్యక్షునిగా గూడవల్లి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షునిగా నంగులూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా వెల్లంపల్లి దిలీప్, మద్దుల పవన్, కార్యదర్శిగా వంకాయల శ్రీనివాస్, కోశాధికారిగా కంచర్ల పాండురంగారావు ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన అంబికా కృష్ణ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు అన్ని పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. నూతనంగా ఎన్నికైన ప్రపంచ ఆర్యవైశ్య సంఘ ఏలూరు జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షుడు నంగులూరి సత్యనారాయణ, అధ్యక్షుడు గూడవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులందరూ సమిష్టిగా మాజానికి సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తామన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	54	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	64	చామదుంపలు	120
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	10-15
బెండకాయలు	64	కంద	56
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	40
కాకర కాయలు	48-56	కీర దోస	36
బీరకాయలు	50	ఫ్రెంచ్‌బీన్స్	74
బీరకాయలు (పందిరి)	70	అల్లం	128
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	44-58	పాలకూర	12
దొండకాయలు	70	చుక్కకూర	12
బంగాళదుంపలు	28	తోటకూర	12
ఉల్లిపాయలు	35	గోంగూర	08
గోరుచిక్కుడు	64	పుదీనా	05
దోసకాయలు	54	బఠాణి	--
ఆనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	74
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	04
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	10
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	01
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	03
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.15	4822	01
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	37
ఏలూరు -తిరుపతి	16.00	4830	32

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ



కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థలోని పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, రెగ్యులర్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డిప్యూటీ కమిషనర్ రాధ కార్మిక సంఘాల నాయకులకు స్పష్టం చేశారు. కార్మిక సంఘాల నాయకులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ఉద్యోగ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు పలు సమస్యలను కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌ల దృష్టికి తీసుకువచ్చారు. ఏలూరు కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు పంచాయతీల ఉద్యోగ, సిబ్బంది, కార్మికులకు 2022 జూన్ నెల వేతనం చెల్లించాలని కోరగా, మూడు విడతల్లో చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఎటువంటి రక్షణ లేని సర్వీసు రిజర్వాయర్ల వద్ద రక్షణ కల్పించేలా సిబ్బందిని నియమించాలని కోరగా, దానికి కమిషనర్ అంగీకారం తెలిపారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెలా వేతనాల్లో కట్ అవుతున్న పీఎఫ్, ఈఎస్ఐ ఆయా ఖాతాల్లోకి జమ చేయాలని, ప్రతి నెలా మొదటి తేదీన హెల్త్ అలవెన్స్, వేతనాలు చెల్లించాలని, ఎనిమిది గంటల పని దినంతో పాటు వారాంతపు సెలవు ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వాళ్లకి కల్పించాలని కార్మిక నాయకులు కోరగా వాటన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకట కృష్ణ హామీ నిచ్చారు. సమావేశంలో మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, డి.వెంకటేశ్వరరావు, బి.సోమయ్య తదితర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పేదలకు న్యాయం

లీడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్



మాట్లాడుతున్న లీడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్

ఏలూరు (టూటౌన్): వచ్చే 2024 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తేనే పేదల బతుకులు బాగుపడతాయని లీడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ అన్నారు. స్థానిక పత్తేబాదలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గత ప్రభుత్వాలు చేయని విధంగా రాజకీయ సముచిత స్థానం కల్పించిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ పేదల పక్షపాతి, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండే నేత అని చెప్పారు. పేద పిల్లలు చదువుకోవాలని సంకల్పంతో ఆయన విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకు వచ్చారన్నారు. నాడు-నేడు విధానం, బైజూస్, ట్యాబ్‌లు ఇచ్చి విద్యార్థుల్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సహాయం కల్పించారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ అండగా నిలవాలని కోరారు. మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు ధీటుగా ఆయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని సొంగా సందీప్ పిలుపు నిచ్చారు.





